
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



క్రైస్తవ తెలుగు మాసపత్రిక

APRIL - 2003

# సత్యవాణి టీ.వీ. స్పందన

"జాషువా గార్కి నమస్కరించి వ్రాయునది: మీ 'సత్యవాణి' టీ.వీ కార్యక్రమాన్ని ప్రతి శనివారం క్రమం తప్పకుండా చూస్తున్నాము. మీ యొక్క వాక్యం మాకు చాలా జ్ఞానభివృద్ధియు, మారు మనస్సును కలిగించేలాగున ఆశ్చర్యకరంగా ఉంటున్నది".

- **V. సులోచన**, సిర్‌పూర్ కాగజ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లా.

"అయ్యా, మీ కార్యక్రమం తప్పక చూస్తాం. మీ యొక్క ప్రోగ్రామ్ వలన మా కుటుంబములో మార్పు కనబడుచున్నది".

- **D. కొర్నేలియస్**, పర్కాల్, వరంగల్ జిల్లా.

"సత్యవాణి! చాల ముగ్ధ మనోహరమైన పిలుపు. ఈ పిలుపుతోనే మానవ జీవితంతలోని 50% పాప ప్రక్షాళన జరుగుతుందనే నమ్మకం కలుగక మానదు. అందునా, జాషువా గారి కంఠం నుండి వెలువడిన ప్రతిమాట సంస్కృతోద్భవ పదాలతో నిండి ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని ప్రంశంసించకుండా ఉండలేక పోవుచున్నాను".

- *సంతోష్ శ్రీవాత్సవ*, వేములవాడ, కరీంనగర్ జిల్లా.

"అయ్యా, మీ ప్రసంగములు వినుటకు ఎంతో ఇంపుగా, హంగూ ఆర్భాటములు, రంకెలు కేకలు, అరుపులు అల్లరి లేకుండా వినసొంపుగా హృదయమును హత్తుచున్నవి. దయతో బైబిలు పాఠములు పంపించమనవి".

- **K. కృపారావ్**, రిటైర్డ్ టీచర్, జగన్నాథపురం. తూ॥గో॥జిల్లా.

'సత్యవాణి' నాయకులకు, అయ్యా! నేను కాపుకులంలో పుట్టి యున్నాను. దేవుని నమ్మి బాప్తిస్మము పుచ్చుకొన్నాను. మీ 'సత్యవాణి' కార్యక్రమముల ద్వారా ఎంతోమంది రక్షింపబడుచున్నారు".

- **A. దోర్కా**, నార్సాపూర్, ప॥గో॥జిల్లా.

"తేజ ఛానెల్‌లో మీ ప్రసంగములు మా ప్రాంతములో క్రమేపి అనేకులను ఆకట్టుకొంటున్నవి. టీ.వీ సువార్త కార్యక్రమాలన్నిటిని మించి అగ్రస్థానములో మా కందరికీల ఉపయుక్తములుగా నున్నవి. 4.1.03 నుంచి వచ్చిన ఎపిసోడ్ లన్నీ తిలకిస్తున్నాము. ప్రతీ ఎపిసోడ్ నూరు శాతం విలువైనదిగా తోస్తున్నది. ప్రసంగములోని ప్రతి అంశము బైబిల్ రిఫరెన్సులతో సహా విడమరచి చెప్పచుండుట వలన రేడియో శ్రోతల

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

Pleading for Restoration of First Century Christianity

సంపుటిక 23 ఏప్రిల్ 2003 సంచిక 1


## ఆరాధన దినము

*(The Day of Worship)*

క్రైస్తవులు దేవునికి అంగీకారయోగ్యమైన ఆరాధన ఎట్లు చేయవలెనో ఇదివరకు మనము నేర్చుకొంటిమి. అయితే ఈ ఆరాధనను క్రైస్తవులు ఏ దినమున చేయవలెను? ప్రతివారములోను ఏడుదినము లున్నవిగదా. అయితే ఏదయినా ఒక దినము ఆరాధన దినముగ ప్రత్యేకింపబడెనా? దీని విషయమై బైబిలు ఏమి బోధించుచున్నదో ఈరోజు తెలిసికొందము.

పాత నిబంధన ప్రకారము యూదుల ఆరాధన దినము సబ్బాతుదినమై యుండెనని మన మెరుగుదుము. అది వారములో ఏడవ దినమని కూడ మన మెరుగుదుము. (నిర్గమ 20:8-11). కాని వాస్తవముగ మము ఇప్పడు పాత నిబంధన కాలమందు లేము. మోషే

ధర్మశాస్త్రము యూదులకు మాత్రమే ఇయ్యబడెను (ద్వితి 5:1-3). మనకు ఇయ్యబడిన ధర్మశాస్త్రము కంటె అది వేరైనది. అది నెరవేర్చబడినది, తొలగించబడినది. గనుక మనము సబ్బాతు దినమును ఆచరింపవలసిన పనిలేదు. "ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింపబడెను; కృపయు, సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను" (యోహా 1:17). యేసుక్రీస్తు ద్వారా కలిగిన క్రొత్త నిబంధన మనకొక క్రొత్త ఆరాధన దినమునిచ్చెను. ఇప్పుడు మనము దేవుని, వారములో ఆఖరి దినమున కాదుగాని, మొదటి దినముననే ఆరాధింపవలెనని దేవుడు కోరుచున్నాడు.

యేసుక్రీస్తు ఒక యూదునివలె జన్మించెను. యూదుని వలె జీవించెను. మోషే ధర్మశాస్త్రకాలమున ఆయన జీవించెను. గనుక ఆయన సబ్బాతు నాచరించెను. అయితే ఆయన బోధలలో మనము సబ్బాతు నాచరించవలెనని ఒక్కసారి కూడ ఆయన ఆజ్ఞ ఇయ్యలేదు. సరిగదా "విశ్రాంతి దినము మనుష్యులకొరకే నియమింపబడెను గాని మనుష్యులు విశ్రాంతి దినము కొరకు నియమింపబడలేదు. అందువలన మనుష్య కుమారుడు (యేసుక్రీస్తు) విశ్రాంతి దినమునకు ప్రభువై యున్నాడని" ఆయన బోధించెను (మార్కు 2:23-28).

క్రీస్తు సంఘము స్థాపించబడిన తరువాత అపొస్తలులు కూడ సబ్బాతు నాచరించలేదు. దాని నాచరించవలెనని పరిశుద్ధాత్మ ద్వారా వారు ఆజ్ఞాపించలేదు. అపొస్తలులలో కొందరు సబ్బాతు దినమున యూదుల సమాజ మందిరములలోనికి వెళ్లిరి గాని ఆరాధించుటకు వారు వెళ్లలేదు. పాత నిబంధనలో నుండి క్రీస్తును ఎత్తి యూదులకు చూపించు నిమిత్తము, యేసుక్రీస్తు సువార్తను యూదులకు విశదముగ బోధించు నిమిత్తము వారు వెళ్లిరి.

అపొస్తలులును, ఆదిమ సంఘస్తులను దేవుని నారాధించుటకు ఆదివారమున, అనగా వారములో మొదటి దినమున కూడుకొనినట్లు క్రొత్త నిబంధన మనకు బోధించుచున్నది. అపొ.కా. 20:7లో మనము చూచిన, "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు

మరునాడు వెళ్లనైయుండి, వారితో ప్రసంగించుచు, అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను" అని వ్రాయబడి యున్నది. అందువలన ఈనాడు క్రైస్తవులయినవారు దేవుని ఆదివారముననే ఆరాధించవలెనుగాని శనివారమున కాదు అని గ్రహించవలెను.

దేవునికి అంగీకారయోగ్యమైన ఆరాధనను మనము చేయునప్పుడు కానుకలిచ్చుట కూడ అందొక భాగమై యున్నదని మనము ఇదివరకే నేర్చుకొనియున్నాము. ఈ కానుకలను ఆరాధన దినమైన ఆదివారమున మనము సమర్పించవలెనని దైవ వేదము బోధించుచున్నది. 1 కొరింథి 16:2లో "నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లినకొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను" అని పరిశుద్ధాత్మవేశము వలన అపొస్తలుడైన పౌలు వ్రాసియున్నాడు. ఆదివారముననే క్రైస్తవులు కానుకల నెందు కీయవలెను? క్రైస్తవులందరు దేవుని నారాధించుటకు ఆ దినమున కూడకొందురు గనుక కానుకల నిచ్చుట కూడ అది అనుకూల సమయమై యున్నది. దీనివలన ఆదివారమే ఆరాధన దినమని మనకు విశదమగుచున్నది.

అంతేకాదు. క్రైస్తవులందరు సంఘముగా కూడుకొని దేవుని నారాధించుటకు వారములో మొదటి దినము దేవునిచే నిర్ణయించ బడినది. అందువలన "కొందరు మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచినకొలది మరి యెక్కువగా ఆలాగున చేయుడి" అని హెబ్రీ 10:25లో క్రైస్తవులకు ఒక హెచ్చరిక ఈయబడినది. కొందరు మానుకొనుచున్నట్టుగా వారు సమాజముగా కూడుట మానరాదు. సరిగదా ఆ దినము సమీపించిన కొలది వారు ఒకరినొకరు హెచ్చరించుకొనుచుండవలెనని దీనిద్వారా మనము గమనించితిమి. సబ్బాతు చట్టము సిలువకు మేకులతో కొట్టబడినదందున (కొలస్స 2:14), ఒక క్రొత్త ఆరాధన దిన మీయబడి యున్నది. అది ఆదివారమే యని

మన మిప్పడు గమనించితిమి.

"ప్రభువు దినమందు ఆత్మవశుడనై యుంటిని" అని యోహాను ప్రకటన 1:10లో వ్రాసెను. ప్రతిదినము ప్రభువు దినమేగాని యోహాను ఒక ప్రత్యేక దినమును సూచించుచు దానిని ప్రభువు దినమని చెప్పచున్నాడు. అది వారములో మొదటిదినము. 118వ దా.కీర్తన 22-24 వరకు మనము చూచిన, "ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి మూలకు తలరాయి ఆయెను. అది యెహోవా వలన కలిగినది. అది మన కన్నులకు ఆశ్చర్యము. ఇది యెహోవా యేర్పాటు చేసిన దినము. దీనియందు మనము ఉత్సహించి సంతోషించెదము" అని దావీదు వ్రాసెను. అయితే యిల్లు కట్టువారైన యూదుల పెద్దలు, అధికారులు తృణీకరించిన రాయి యేసుక్రీస్తే అనియు, ఆరాయి మూలకు తలరాయి ఆయె ననియు అపొ.కా. 4:11లో పేతురు బోధించెను. తృణీకరింప బడినను యేసుక్రీస్తు మూలకు తలరాయి ఎప్పడు అయ్యెను? ఆయన సమాధిని జయించి తిరిగి లేచినప్పడే గదా. ఆయన సమాధి నుంచి ఏదినమున తిరిగి లేచెను? "ఆదివారమున, తెల్లవారినప్పడు యేసు లేచెనని" వాక్యము చెప్పచున్నది (మార్కు 16:9). యేసు ఆదివారమున సమాధిని జయించి లేచెను గనుక ఆ దినమున ఆయన మూలకు తలరాయి ఆయెను. అది యెహోవా వలన కలిగినది. అది యెహోవా ఏర్పాటుచేసిన దినము అని దావీదు వ్రాసెను. యోహోవా వలన ఏర్పాటు చేయబడిన దినమే మన ప్రభువు సమాధిని జయించి లేచిన దినము. ఆ దినము ఆదివార దినము. అది ప్రభువు దినము. అందువలననే ప్రభువు దినమందు ఆత్మవశుడనై యుంటిని అని యోహాను చెప్పెను. క్రైస్తవులు దేవునిని ఆత్మతోను, సత్యముతోను ఆరాధించు దినము అది (యోహాను 4:24).

లేవీ యాజక ధర్మము చొప్పన చేయబడు పాత ఆరాధన క్రమమును తీసివేసి క్రీస్తు మనకొక క్రొత్త ఆరాధన క్రమమును, ఆరాధన దినమును ఇచ్చియున్నారు. పాత ఆరాధన క్రొత్త ఆరాధనచే మార్చబడినది.

పాత ఆరాధన దినము పోయి క్రొత్త ఆరాధన దినము వచ్చినది. క్రీస్తు యేసుని రక్తము ద్వారా పశుపక్ష్యాదుల రక్తబలులు అంతమొందినవి. లేవీ యాజక ధర్మము పోయి మెల్కీసెదెకు క్రమము చొప్పున యేసుక్రీస్తు మనందరకు ప్రధాన యాజకుడయ్యెను. యాజకులు మార్చబడినందున యాజక ధర్మము సహా మార్చబడెను (హెబ్రీ 7:11, 12). అందువలన దేవుని నారాధించు దినము ఏడవ దినము నుండి వారములో మొదటి దినమునకు మార్చబడెను. అది అట్లు మార్చబడుటకు మనమనేక కారణములను వాక్యప్రకారము చూడవచ్చును.

ఆదివారమున క్రీస్తు సమాధినుండి లేచెను (మత్తయి 28:1-7). ఆయన తిరిగి లేచిన తరువాత ఆదివారమున తన శిష్యులను రెండుసార్లు కలసికొనెను (యోహాను 20:19, 26).

పరిశుద్ధాత్ముడు పెంతెకోస్తు దినమున అపొస్తలులపై కుమ్మరింపబడెను. అది ఆదివారము (అపొ.కా. 2:1-4). ఏలయనగా పెంతెకోస్తు ఎల్లప్పుడు వారములో మొదటి దినముననే వచ్చెను (లేవీ 23:15-16). సువార్త మొట్టమొదటిగా వారములో మొదటి దినమున ప్రకటింపబడెను.

క్రీస్తు సంఘము ఆదివారమున స్థాపించబడెను (అపొ.కా. 2:38-47). ఆ దినమున ఇంచుమించు మూడువేలమంది సంఘముతో చేర్చబడిరి.

ఆదివారమున శిష్యులు రొట్టె విరుచుటకు, కానుకల నీయుటకు కూడుకొనిరి. అపొ.కా. 20:7, 1 కొరింథి 16:1-2 వచనముల మనకు ఈ సంగతిని విపులముగా బోధించుచున్నవి.

ఆదివారమున క్రైస్తవులు సంఘముగా సమకూడి దేవుని నారాధించుట మానరాదు అని వాక్యము బోధించుచున్నది (హెబ్రీ 10:25). యోహాను దానిని ప్రభువు దినమని చెప్పెను. అది ఆరాధన దినము. యేసు ప్రభుని వారములో వెనుకనుంచుట కంటె ముందు ఉంచు దినము అది.

మనము దేవునికి చేయు సేవ ఆయనకు ప్రీతికరముగా

నుండవలెనన్న ఆయన చెప్పిన రీతిగనే మనము చేయవలెను. మానవ కల్పిత సిద్ధాంతము లతో మనము దేవుని నారాధించిన యెడల, "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా నున్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని మత్తయి 15:9లో యేసు చెప్పెను. నీ ఆరాధన వ్యర్థము కాకుండునట్లు ఆయన చెప్పదినమున, ఆయన చెప్పినరీతిగ ఆరాధించుము. నీ ఆరాధన ఆయన అంగీకరించులాగున నీవు ఆయనతోను, ఆయన సంఘముతోను చేర్చబడుము. యేసుక్రీస్తు దేవుని కుమారుడని నీ హృదయమందు విశ్వాసముంచి, నీ పాప జీవితమును పరిత్యజించి, ఆయన నామము నొప్పుకొనుచూ నీ పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము (రోమా 10:9-10; అపొ.కా. 2:38). నీవు అట్లు చేసి ఆయన వాక్యప్రకారము ఆయనను సేవింప మొదలిడిన యెడల నీ సేవను, నీ ఆరాధనను ఆయన తప్పక అంగీకరించును.

--- జాషువా గూటం.

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి"
కార్యక్రమమును తేజ ఛానల్‌లో ప్రతి శనివారం
ఉ॥ 6:30 నుండి 7-00 వరకు చూడండి.

ఉపమానమాలిక :

## విత్తనము - విత్తువాడు

*(The Sower & the Seed : Way side Hearer)*

**మత్తయి 13:3-23**

యేసు ప్రభువు చెప్పుచున్న ఆత్మీయ సంగతులను వినడానికి బహుజనములు కూడి వచ్చినందున ఆయన వారిని చూచి చాల సంగతులను ఉపమానరీతిగా చెప్పారు. "ఎట్లనగా - ఇదిగో విత్తుటకు విత్తువాడు బయలు వెళ్లెను. వాడు విత్తుచుండగా కొన్ని విత్తనములు త్రోవ ప్రక్కన పడెను; పక్షులువచ్చి వాటిని మ్రింగివేసెను. కొన్ని చాలా మన్ను లేని రాతి నేలను పడెను; అక్కడ మన్ను లోతుగా ఉండనందున అవి వెంటనే మొలిచెను గాని సూర్యుడు ఉదయించినప్పుడు అవి మాడి వేరు లేనందున ఎండిపోయెను. కొన్ని ముండ్ల పొదలలో పడెను; ముండ్ల పొదలు ఎదిగి వాటిని అణచి వేసెను. కొన్ని మంచి నేలను పడి, ఒకటి నూరంతలుగాను, ఒకటి అరువదంతలుగాను, ఒకటి ముప్పదంతలుగాను ఫలించెను" (మత్తయి 13:1-9; 18-23; మార్కు 4:3-8; 14-20; లూకా 8:4-8, 11-15).

యేసు ప్రభువు చెప్పిన ఉపమానములలో ఇది మొదటిది. మత్తయి సువార్త 13వ అధ్యాయములో ఆయన చెప్పిన ఏడు ఉపమానములున్నాయి. వాటిలో నాలుగు జన సమూహములకును, మూడు శిష్యులకును చెప్పబడినవి. అవి రాజ్యము యొక్క ఏడు లక్షణములు తెలియజేయునవి. గలిలయలో తిబెరియ సముద్ర తీరమున యేసు ఈ ఉపమానములను బోధించారు. జన సమూహములందరు దరిని నిలిచియుండగా ఆయన ఒక దోనె యెక్కి దానిని తన ప్రసంగ వేదికగా చేసికొని, కూర్చొని బోధించారు. అక్కడ కూడి వచ్చినవారు ఒక గొప్ప జనసమూహము, వారికి ఉపదేశించుచున్న వాడు గొప్ప బోధకుడైన యేసు ప్రభువు. అందువలన వారికి ఆయన గొప్ప పాఠములను బోధించారు.

ఆయన యెదుట నున్న జన సమూహములో నాలుగు రకములైన ప్రజలున్నారు. శాస్త్రులు పరిసయ్యులు ఆయన బోధలో తప్పు పట్టుకొనడానికి, ఆయనను శోధించడానికి ఆ జన సమూహములో యున్నారు; కొందరు తమ రోగముల నుండి స్వస్థత పొందవలెననే ఆసక్తితో దానిలో యున్నారు. మరికొందరు అద్భుత రీతిగా ఆయన ఆహారము పెడితే తిందామని ఎదురు చూచువారు ఆ జనసమూహములో యున్నారు; మరికొందరయితే ఆత్మ విషయమై నిజమైన ఆకలిదప్పికలు కలిగి ఆయన మాటలు వినడానికి యధార్థ మనస్సుతో అక్కడకు వచ్చారు. ఈ రీతిగా వివిధ మనస్తత్వములు కలిగి ఆయన చెప్పు మాటలను వినుచున్న వారిని యేసు ప్రభువు గమనించారు. వారేమి వినుచున్నారో జాగ్రత్తగా చూచుకొనవలెనని వారిని హెచ్చరించుటకు, వారెట్లు వినుచున్నారో దానిని గూర్చి జాగ్రత్త పడవలెనని హెచ్చరించుటకు యేసు విత్తువాని ఉపమానమును చెప్పారు.

## వినుటను గూర్చి :

ఈ ఉపమానము వినుటను గూర్చిన ఉపమానము. మనం ఆత్మీయ సంగతుల నెట్లు వినవలెనో తెలియ జేయుటకు యిది మొదట చెప్పబడిన ఉపమానము. విత్తనములు విత్తబడిన నేలను బట్టియు, విత్తనమును బట్టియు, విత్తువానిని బట్టియు పంట ఆధారపడి యుంటాది. మనం సువార్త బోధించుచున్నప్పుడు వినుచున్న వారి హృదయ పరిస్థితిపై ఫలితములు ఆధారపడి యుంటాయి.

వ్యవసాయకుడు ఫలితము నాశించుచు ఎట్లు విత్తనములను విత్తునో అట్లే సువార్త బోధకుడు దేవుని వాక్యమును విత్తును. విత్తనము దేవుని వాక్యము (లూకా 8:11). వ్యవసాయకుడు విత్తనములు విత్తుచుండగా అవి మంచి నేలను పడుటయేగాక కొన్ని త్రోవ ప్రక్కను, కొన్ని రాతినేలను, మరికొన్ని ముండ్ల పొదలలోను పడును. అట్లే సువార్త వాక్యము విత్తబడుచుండగా అది నాలుగు రకములైన హృదయములలో పడును. ఆ వాక్యమును వినిన వాని హృదయ పరిస్థితిని బట్టి అతడు

తెచ్చు ఆత్మీయ ఫలము ఆధారపడియుండును. "కలిగిన వానికి ఇయ్య బడును, లేనివాని యొద్దనుండి, తనకు కలదని అనుకొనునది కూడ తీసివేయ బడును గనుక మీరేలాగు వినుచున్నారో చూచుకొనుడని" యేసు చెప్పారు (లూకా 8:18).

విత్తువాడు విత్తుచుండగా కొన్ని విత్తనములు త్రోవ ప్రక్కనపడి త్రొక్కబడెను అని యేసు ప్రభువు చెప్పారు. "విత్తనము దేవుని వాక్యము, త్రోవ ప్రక్కనుండువారు, వారు వినువారుగాని నమ్మి రక్షణ పొందకుండు నట్లు అపవాది వచ్చి వారి హృదయములోనుండి వాక్యమెత్తి కొనిపోవు నని" ఆయన దాని భావమును చెప్పారు. ఇట్టివారు తటస్థముగా యుంటారు, వినీ వినని పరిస్థితిలో యుంటారు, ఉదాసీనత కలిగి యుంటారు. వీరు త్రోవ ప్రక్క నుండువారు. పొలాల్లో వ్యవసాయకుడు నడిచివెళ్లే దారియిది. దానిపైభాగము గట్టిబడి యుంటాది. అందువలన విత్తనములు భూమి లోపలికి వెళ్లలేవు. అవి త్రోవ ప్రక్కనుపడి త్రొక్కబడతాయి, మరియు ఆకాశ పక్షులు వాటిని మ్రింగివేస్తాయి. ఈ విత్తనములు పడిన నేల స్వాభావికముగా మంచిదేగాని కాళ్లతో త్రొక్క బడుటవలన గట్టిబడిపోయింది. విత్తనము లోపలికి చొచ్చుకొని వెళ్లలేకపోయింది.

మానవ హృదయం కూడ అంతే. వాక్యము ప్రకటించబడు చుండగా వినుచున్న వాని హృదయం నానావిధములైన తలంపులతో నిండి యుంటాది. పక్షులు వచ్చి విత్తనాన్ని ఎత్తుకుపోయినట్లు వాక్యమును ఏమాత్రమైనా వినిన యితడు, రక్షింపబడకుండునట్లు అపవాది వచ్చి అతని హృదయములో నుండి దానినెత్తుకొనిపోవును. అతడు నిష్ఫలుడగును; ఆత్మీయంగా నశించును.

గనుక నీవెట్టి పరిస్థితిలో యుండి వినుచున్నావు? నీ వేలాగు వినుచున్నావు? అనేక పాపములు చేయుటవలన నీ హృదయం గట్టిబడి పోయిందా? క్రీస్తును గూర్చిన వాక్యమును వింటావే గాని దాని నెదురాడుటయే నీ స్వభావమా? అనేక దురలవాట్లవలన నీ హృదయం

త్రోవ ప్రక్కన పడిననేలవలె తయారయ్యిందేమో? ఇస్కరియోతు యూదా హృదయం ఇటువంటిదే ప్రభువుయొక్క ఉపదేశములను వినుచునే వచ్చాడుగాని వాని దురాశ, దుర్బుద్ధి వలన అతని హృదయం గట్టిబడి పోయింది. అతని హృదయంలోపడిన వాక్యం అపవాది ఎత్తుకు పోయింది. కొందరు ద్వేషము వలన సత్యమును అంగీకరించరు. "ఈ ప్రజలు కన్నులార చూచి చెవులారా విని హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పకొని నా వలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది, వారి చెవులు వినుటకు మందములైనవి........ అని యెషయా చెప్పిన ప్రవచనము వీరి విషయమై నెరవేరుచున్నదని" యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 13:14, 15).

నీ హృదయ పరిస్థితి ఎట్లున్నది? క్రీస్తును గూర్చిన వాక్యమును మంచి హృదయముతో వినుము. ఉదాసీనత కలిగి యుండకుము. క్రీస్తు ప్రభువును హృదయపూర్వకముగా అంగీకరించి, పాపముల విషయమై మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది, క్రీస్తు కొరకు మంచి ఫలములు ఫలించుము (రోమా 10:17; మార్కు 16:16; అపొ.కా. 2:38).

---- జాషువా గుటం

సత్యవాణి రేడియో కార్యక్రమాలను ప్రతి
ఆది, సోమ, బుధ గురువారాల్లో
మధ్యాహ్నం 2:00 గంటలకు
రేడియో శ్రీలంక ద్వారా వినండి.
మీ బంధుమిత్రులకు విపించండి!!

## బైబిలు అర్థము చేసికొనుటకు పది సూత్రములు

(ఫిబ్రవరి సంచిక తరువాయి)

పాతనిబంధనలో 4 విభాగములున్నవి. వాటిలో సంగ్రహించబడిన అంశములను బట్టి అవి విభాగింపబడినవి.

I మోషే ధర్మశాస్త్రము : మొదటి ఐదు పుస్తకములు.

ఆదికాండము : ఇందు మోషే సృష్టిని గూర్చి, మానవుని అరంభ చరిత్రను గూర్చి చెప్పుచున్నాడు. ఇందు దేవుడు అబ్రహాముకు "భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడునని" చేసిన వాగ్దానము మనకు కనబడును (ఆది కా. 12:1-3; 22:18). క్రీస్తే ఆ సంతానమై యున్నాడు. (గలతీ 3:16-19; మత్త 1:1). అబ్రహాము మనుమడైన యాకోబు పేరును ఇశ్రాయేలుగా దేవుడెట్లు మార్చాడో ఆదికాండము 35:10 తెలియజేయుచున్నది.

పాత నిబంధనలోని మిగతా పుస్తకములు ఇశ్రాయేలీయులతో ఒక జనాంగముగా దేవుడెట్లు సంప్రదించాడో తెలియజేయుచున్నవి. ఆ జనాంగమునుండియే క్రీస్తు రావలసియుండెను. క్రీస్తు వచ్చిన తరువాత దేవుడు ఇశ్రాయేలీయులకు యితరులకు మధ్య వ్యత్యాసము లేకుండ జేసెను (అపొ.కా. 15:9).

నిర్గమ కాండము : ఐగుప్తు బానిసత్వము నుండి ఇశ్రాయేలీయులు నిష్క్రమించుటను గూర్చి నిర్గమకాండము చెప్పుచున్నవి. 20వ అధ్యాయము ధర్మశాస్త్రము ఇచ్చుటను గూర్చి చెప్పుచున్నది. వారు దానిలోని మాదిరిననుసరించి దేవుని నారాధించాలి, సేవించాలి (నిర్గమ 34:40).

లేవీ కాండము : యాజకులైన లేవీయులు జరిగించవలసిన మత సంబంధ విధులను గూర్చి ఈ పుస్తకము చెప్పుచున్నది.

సంఖ్యా కాండము : ఇంచుమించు ఆరు లక్షల మంది యొక్క జన సంఖ్యను లెక్కించుటను గూర్చియు, 40 సంవత్సరముల మట్టుకు దేవుడు అరణ్యముగుండా వారిని నడిపించుటను గూర్చియు ఈ పుస్తకము చెప్పుచున్నది.

ద్వితీయోపదేశ కాండము : దేవుని ధర్మశాస్త్రము రెండోసారి వినిపించబడుటను గూర్చియు, దానికి ప్రజలు లోబడుటను గూర్చియు ఇందు వ్రాయబడియున్నది. దేవుడు ఇశ్రాయేలీయులను కానానుకు నడిపించుచున్నాడు. వారక్కడ స్థిరపడిన తరువాత ఆయన ఆ ధర్మశాస్త్ర మును వారు మరచిపోకూడదని ఆయన అభిమతమైయుండెను. వారు దానికి లోబడాలని, దాన్ని తమ పిల్లలకు ఉపదేశించాలనీ ఆయన కోరెను.

## II చరిత్ర గ్రంథములు - 12 చరిత్ర పుస్తకములు

తరువాత 12 పుస్తకములు యెహోషువ గ్రంథము నుండి ఎస్తేరు గ్రంథము వరకు వెయ్యేండ్లకంటే పైగా దేవుడు తన ప్రజలతో సంప్రదించిన విధానమును గూర్చి తెలియజేయుచున్నవి. ఇశ్రాయేలీయులు యొర్దాను నదిని దాటునట్లు దానిలో ఆయన ఆరిన నేలను ఎట్లు కలుగజేసెనో యెహోషువ గ్రంథము తెలియజేయుచున్నది. తరువాత వాగ్దాన దేశములో వారు స్థిరపడిన విధానము కూడ అదితెలియజేయుచున్నది. మోషే ద్వారా ఇయ్యబడిన ధర్మశాస్త్రము నుండి కుడికిగాని ఎడమకుగాని తొలగకూడ దని దేవుడు మరియొకసారి వారికి జ్ఞాపకము చేసెను (యెహోషువ 1:7-8). అయితే ఈ 12 గ్రంథములను చదువుట ద్వారా వారు నైతికంగాను, ఆత్మీయకంగాను దేవుని నుండి ఎట్లు తొలగిపోయారో మనకు తెలియనగును.

## III పద్యకావ్య గ్రంథములు - దైవ ప్రేరిత 5 పద్యకావ్యములు

- యోబు గ్రంథము - శోధన బాధలలో దేవుని యందు నమ్మికను గూర్చి చెప్పను.
- కీర్తనల గ్రంథము - దేవుని యందలి విశ్వాసమును, ఆయనను స్తుతించుటను గూర్చి చెప్పను.
- సామెతల గ్రంథము - అనుదిన జ్ఞానము కొరకైన వివేక వచనములు.
- ప్రసంగి గ్రంథము - ఈ లోకములోని ధనధాన్యములు,

సంపత్తి, సుఖభోగము లన్నిటికంటె దేవుని సేవించుట ఉత్తమమని చెప్పను.

- పరమ గీతము - వైవాహిక జీవిత మధురాన్ని సంఘము యెడల క్రీస్తుకున్న ప్రేమతో పోల్చి చెప్పను.

IV ప్రవచన గ్రంధములు - ప్రవచనములతో కూడిన 17 గ్రంధములు

ప్రవక్తల యొక్క ఈ 17 పుస్తకములు దేవుని ప్రజలు చరిత్రను మనకు చెప్పను. వారు అవిధేయతతో యుండిన యెడల ఏమి జరుగునో ప్రవక్తలు పలికేవారు. అది అట్లే జరిగేది! వారు క్రీస్తు యొక్క జనన మరణములను గూర్చి ఆయన సంఘమును గూర్చి కూడ ప్రవచించిరి.

క్రొత్త నిబంధనలో కూడ 4 విభాగములున్నవి :

I క్రీస్తు చరిత్ర : క్రీస్తు జీవితమును ఇద్దరు అపొస్తులులు, మత్తయి, యెహోను (యోహోను 14:26) మరియు దైవ ప్రేరిత లేఖకులు మార్కు, లూకా వ్రాసిరి (ఎఫెసీ 3:4-5). యేసు యొక్క జీవితంలోని గొప్ప సంఘటనలన ఇవి చెప్పచున్నవి. సర్వజనాంగములు గ్రహించుకొను రీతిగ ఈ నాలుగు పుస్తకములు వివిధ దృక్కోణముల నుండి క్రీస్తు చరిత్రను తెలియజెప్పచున్నవి. మత్తయి మొదటి అధ్యాయము, లూకా 1,2 అధ్యాయములు యేసు కన్య మరియకు జన్మించిన విధానమును చెప్పను. సిలువ పై ఆయన మరణం సమాధి, పునరుత్థానములను గూర్చి ఈ నాలుగు పుస్తకములలోని ఆఖరి అధ్యాయములు తెలియజెప్పను. యేసు చేసిన గొప్ప బోధలు ఇందులో యున్నవి. మనమాయనను వెంబడించు వారమైన యెడల ఆయన ఉపదేశములను సహృదయముతో పఠించాలి, అంగీకరించాలి.

క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఆయన శిష్యులు సర్వలోకముకు వెళ్లి సర్వసృష్టికి సువార్త ప్రకటించాలనే గొప్ప ఆజ్ఞ యిచ్చెను (మత్తయి 28:19-20; మార్కు 16:15; లూకా 24:46-47). సువార్త వాక్యమును

వినువారు విశ్వసించాలి. మారు మనస్సు బొంది బాప్తిస్మము పొందాలి. అపొస్తలుల కార్యముల గ్రంథము వారి యాజ్ఞను పాటించినట్లు తెలియ జేయును.

II సంఘ చరిత్ర - ఒకే ఒక్క పుస్తకము, ఆదిమ సంఘ చరిత్రను తెలియజేయును. అపొస్తలుల కార్యముల గ్రంథము కొందరు అపొస్తలుల యొక్కయు మిగతావారి యొక్కయు ఆదిమ సంఘారంభమును గూర్చిన కార్యములను తెలియజేయును. అపొస్తలుల కార్యములు మొదటి అధ్యాయము క్రీస్తు యొక్క మరణ పునరుత్థానములను జ్ఞాపకము చేయును. 9-11 వచనములు క్రీస్తు పరమందున్న తండ్రి యొద్దకు ఆరోహణుడగుటను గూర్చి తెలియజేయును. రెండవ అధ్యాయములో అపొస్తలులు ప్రత్యేకముగా పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుటను గూర్చి చదువగలము. క్రీస్తు సువార్తను వినిన వారు ఆయనను సిలువ వేయుడియని అరచిన మూడ వేల మంది ఆయన యందు విశ్వసించి, మారు మనస్సు పొంది, బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 2:36-41). క్రీస్తు వారిని తన సంఘముతో చేర్చుకొనెను (అపొ.కా. 2:41, 47; మత్తయి 16:18).

అపొస్తలుల కార్యముల గ్రంథములోని మిగత అధ్యాయములు క్రైస్తవుల యొక్క ఉత్సాహమును, సంఘాభివృద్ధిని తెలియజేయును. అనేకులు విగ్రహములను వీడి, క్రీస్తును ఒప్పుకొని బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 8:35-38; 16:19-22;18:8).

III పత్రికలు : క్రైస్తవులకు వ్రాయబడిన 21 ఉత్తరములు

ప్రజలు క్రైస్తవు లెట్లయ్యారో అపొస్తలుల కార్యముల గ్రంథము తెలియ జేయుచున్నది. తరువాత 21 పుస్తకములు క్రైస్తవులైన వారికి వ్రాయబడిన ఉత్తరములు. కొన్ని పత్రికలు ఆయా వ్యక్తులకు వ్రాయబడినవి. ఉదహరణకు పౌలు తిమోతికి, తీతుకు వ్రాసిన పత్రికలు. మిగతావి ఆయా ప్రాంతములలో యున్న సంఘములకు, వారిని హెచ్చరించుటకు, సరిదిద్దుటకు గద్దించుటకు వ్రాయబడినవి.

రోమా పత్రిక నుండి ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రిక వరకు యున్న 13 ఉత్తరములు పౌలుచే వ్రాయబడెను. హెబ్రీ పత్రిక కూడ అతనే వ్రాసియుండవచ్చును. మిగతావి యాకోబు, పేతురు యోహాను, యూదాలచే వ్రాయబడెను. అవన్నీ మొత్తం 21 పత్రికలుంటాయి.

క్రైస్తవులకు వ్రాయబడిన పత్రికలన్నీ వ్యక్తిగత దైనందిన భక్తి జీవితమును గూర్చియు, నిస్వార్థమైన ప్రేమను గూర్చియు చెబుతాయి. సంఘము యొక్క నిర్మాణపద్ధతి, ఆరాధన యెట్లుండవలెనో కూడ అవిచెబుతాయి. వివిధ డినామినేషన్ల వలెగాక సంఘము ఏకమై యుండాలనే దేవుని కోరిక కూడ వాటిలో వ్యక్తమవుతాది. అందువలన ఆదిమ సంఘము ఎట్లుండెనో మనము తెలిసికోవాలంటే ఈ పత్రికలు తప్పక చదవాలి.

IV ప్రవచనము : ఒకే పుస్తకం ప్రకటన గ్రంథము

"త్వరలో సంభవింపబోవు సంగతుల" బయల్పాటును క్రీస్తు యోహానుకు తెలియపరచెను (ప్రకటన 1:1). ప్రకటన గ్రంథమంతయు ఎక్కువ గురుతులతోను, అలంకారరీతిగాను లిఖించబడెను. దానిలోని గురుతులకు పలు భావార్థాలు చెప్పటగాక బైబిలు యొక్క బోధను మనం క్షుణ్ణంగా అర్థం చేసికొనిన యెడల, మనం ప్రకటన గ్రంథము నర్థము చేసికోగలము. అయితే ఎన్ని శోధనలు సంభవించినను దేవుడు తన సింహాసనముపై నున్నాడు. సత్యమే విజయం సాధించుననే గొప్ప సంగతిని మనము గ్రహించుకోగలము. దానిలోని ఆఖరి రెండు అధ్యాయములు క్రైస్తవుని పరలోక గృహాన్ని వర్ణిస్తాయి.

7. బైబిలులోని ఏ మాటనైనా గ్రహించుకోవాలంటే మూడు సంగతులు గమనించాలి :

ఎవరు, ఎప్పుడు, ఎవరితో చెప్పారు? అనే సంగతులు తెలిసికోవాలి. ఎవరు చెప్పారు? అనునది ఆలోచించాలి. నీవు చదువుచున్నది ఆత్మ ప్రేరితుని మాటా? లేక వేరొకడు చెబితే అది అక్కడ రికార్డు చేయబడిందా? "మీరు చావనే చావరు" అనే సాతాను యొక్క అబద్ధాన్ని

ఆదికాండము 3:4లో రికార్డు చేయబడింది. గనుక ఎవరు చెప్పారు? అనే అంశము గమనించుట ప్రాముఖ్యము.

ఎవరితో చెప్పబడింది? అనే సంగతి కూడ ఆలోచించాలి. అది అందరికీ చెప్పబడిందా? లేక ప్రత్యేకంగా కొందరికేనా? అను సంగతి తెలిసికోవాలి. సర్వసృష్టికి కొన్ని సంగతులు చెప్పబడాలని క్రీస్తు చెప్పారు (మార్కు 16:15-16). దేవుని వాక్యాన్ని బయలు పరుస్తు స్థిరపరచుటకుగాను అపొస్తలులకే చెప్పబడిన మరికొన్ని మాటలు కూడ ఉన్నాయి. ఏమి చెప్పదుము? ఏలాగు చెప్పదుము? అనే సంగతులను గూర్చి అపొస్తలులు బాధపడనవసరంలేదు (మత్తయి 10:19-20). మనమైతే దేవుని వాక్యాన్ని చదవాలి (2 తిమో 2:15).

అది క్రైస్తవుడు కాని వానికి, క్రైస్తవుడగుట యెట్లో చెప్పబడిందా? లేదా క్రైస్తవుడైన వానికే చెప్పబడెనా? దీనిని కూడా తెలిసికోవాలి.

ఎప్పుడు చెప్పబడింది? అనే సంగతిని కూడ ఆలోచించుకోవాలి. అదొక ఆజ్ఞా? లేక మాములుగా చెప్పబడిన మాటా? అది క్రీస్తుకు ముందు యూదులకు చెప్పబడిందా? లేదా క్రీస్తే తన శిష్యుల నాజ్ఞాపించెనా? అనేకులు పాతనిబంధనకాలపు యూదుల ఆరాధనను క్రొత్తనిబంధన ఆరాధనతో మిళితము చేసి పొరబడుతు యుంటారు.

క్రీస్తు చనిపోయిన తరువాత గాని క్రొత్త నిబంధన పద్ధతి అమలులోనికి రాలేదని గ్రహించుము. మరణ శాసనము వ్రాసిన వాడు మరణిస్తేనే అదిచెల్లును గాని అతడు జీవించుచుండగా ఎప్పడు చెల్లదు అని హెబ్రీ 9:16-17 లో వ్రాయబడి యున్నది. యేసు ప్రభువు క్రొత్త నిబంధనను బోధించుచున్నను, ఆయన పాతనిబంధన కాలములోనే జీవించుచుండెను. గనుక పశుబలుల నాజ్ఞాపించెను (లూకా 5:14; లేవీ 14:4-10), యూదుల సబ్బాతును (లూకా 4:16), మరియు పస్కాను ఆయన ఆచరించెను (మత్త 26:18).

8 అలంకార రీతిగ చెప్పబడితేనే గాని ఆయా మాటలు, పదములు అక్షరార్థముగానే గ్రహించుకోవాలి:

ఆయా పదములకున్న సహజ అర్థము తెలిసికోవాలి. దాన్ని తెలిసికొనుటకు ఒక నిఘంటువును వాడుకోవచ్చును. బైబిలులో ఆయా పదములు ఎట్లు వాడయడెనో తెలిసికోవాలి. ఉదా: బాప్తిస్మము. ఆదిమ గ్రీకులో యిది ముంచబడుట అను అర్థము కలిగియున్నది. దాన్ని బైబిలు వాక్యములతో చూచి గ్రహించుకోగలము. మత్తయి 3:16; అపొ.కా. 8:36-38; రోమా 6:3-4ను చదువుము.

**రూపకాలంకారములను గ్రహించుకొనుము :** అన్ని భాషలలోను రూపకాలంకారములు వాడబడును. తద్వారా సంభాషణ చిత్రీకరించినట్లుండును. రూపకాలంకారము వాడబడినప్పడు దానిలోని మాటలను అక్షరార్థముగా గ్రహించుకోరాదు. కుయుక్తిపరుడైన హేరోదును గూర్చి చెబుతు యేసు, "మీరు వెళ్లి ఆనక్కతో ఈలాగు చెప్పడి" యనెను (లూకా 13:32). హేరోదు నిజముగానక్కకాదు. అతడు నక్క వలె యుండెను. యెహాను యేసును "దేవుని గొర్రెపిల్ల" యని వర్ణించెను. అయితే యేసు నాలుగు కాళ్లు గల నిజమైన గొర్రెపిల్ల యని దీని యర్థము కాదు. బలిగా అర్పింపబడుటకు తేబడిన గొర్రెపిల్ల వలె ఆయన యుండెను. సిలువ మరణములో యేసు ప్రభువు పాప ప్రాయశ్చిత్తార్థ బలియాయెను.

యేసు క్రీస్తు ప్రభురాత్రి భోజనమును ప్రతిష్ఠించుచు ఒక రొట్టెను పట్టుకొని తన శిష్యుల కిచ్చి - మీరు తీసికొని తినుడి; ఇది నా శరీరమని చెప్పెను (మత్త 26:26). ఆరొట్టె ఆయన మాంసముకాదు గాని అది ఆయన శరీరమునకు గురుతు అని మనం గ్రహించుకొంటాము (1 కొరింధి 11:24-27).

**9.ఏ వచనమునైనను సందర్భానుసారముగ గ్రహించుకొనుము:** బైబిలులోని ఏవచనమైనను అది చెప్పబడిన సందర్భమును బట్టి గమనించుకోవాలి. దాన్ని తెలిసికొనుటకు దానికి ముందు, వెనకాయున్న వచనములను చదువుట మంచిది. మరియు ఆ అధ్యాయములో ఏ అంశాన్ని గూర్చి చెప్పబడిందో గమనించుము.

కొందరు బైబిలులోని మాటలను ఇక్కడ అక్కడా తీసికొని వాటిని

సందర్భరహితముగా ఉపయోగిస్తారు. అది విచారకరం. సరిగదా బైబిలులో లేని సిద్ధాంతములను నిరూపించుటకు వారు వీటిని వినియోగిస్తారు. మత్తయి 27:5లో యూదాపోయి ఉరిపెట్టుకొనెను అని యున్నది. "నీవును వెళ్లి ఆలాగ చేయుమని" లూకా 10:37లో యున్నది. "నీవు చేయుచున్నది త్వరగా చేయుమని" యోహాను 13:27లో వ్రాయబడి యున్నది. ఈ లేఖనాలను బట్టి మనము పోయి ఉరిపోసుకోవాలా? కానేకాదు. అయితే పైనున్న వచనాలను సందర్భరహితముగా ఉపయోగిస్తే యేమిజరుగునో యిది తెలియజేయుచున్నది.

సందర్భాన్ని గమనించునప్పుడు ఆచారములకు ఆజ్ఞలకు గల వ్యత్యాసమును గమనించుము :

కొన్ని సంగతులు ప్రత్యేకముగా ఆజ్ఞాపింపబడినవి. యేసు ఇట్లు చెప్పెను : "నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించువాడు" (యోహాను 14:21). క్రీస్తు అపొస్తలులకు ఆజ్ఞలనిచ్చెను (అపొ.కా. 1:8; మత్తయి 28:19-20; అపొ.కా. 10:48; 1 కొరింథీ 7:10-11). ఈ ఆజ్ఞలను వారెట్లు గైకొనిరో కూడ బైబిలు బోధించుచున్నది. మనం ఆజ్ఞలను, వాటి ఉదాహరణలను అనుసరించాలి.

కొన్ని సంగతులు నాటి కాలపు ఆచారములైయుంటాయి. అయితే సాంఘికాచారములు ఆజ్ఞలు కానేరవు. దేవుని ఆజ్ఞకు విరోధముగా యున్న ఏ ఆచరామునైన తిరస్కరించాలి (మత్తయి 15: 8-9). దేవుని ఆజ్ఞకు విరోధముగా లేని సాంఘికాచారములను పాటించినను, పాటించక పోయినను ఫరవాలేదు. కొన్ని సామాజిక ఆచారములు మర్యాదను చూపుటకు పాటించునట్టివి (1 కొరింథీ 11:14-16).

10. ఏ అంశమైనను, బైబిలు అంతటిలో దాన్ని గూర్చి యేమి చెప్పబడినదో తెలిసికొనుము :

ఒక అంశము పై బైబిలులో చెప్పబడిన దంతయు అంగీకరించుట యుక్తమగును. మనం సత్యాన్ని, సత్యాన్నే తప్ప మరి దేనిని కోరుకోకూడదు. దేవుని వాక్యమే సత్యము (యోహాను 17:17). గనుక దాన్నంతటిని మనం

అంగీకరించాలి. యేసు "మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటినుండి వచ్చు ప్రతి మాటవలన జీవించును" అని చెప్పెను . ప్రతిమాట అని ఆయన చెప్పెను. కొర్నేలి సరియైన స్వభావము కలిగి యుండెను : అతడు పేతురుతో, "నీవు వచ్చినది మంచిది. ప్రభువు నీకు ఆజ్ఞాపించిన వన్నియు వినుటకై యిప్పడు మేమందరము దేవుని యెదుట ఇక్కడ కూడి యున్నామని చెప్పెను" (అపొ.కా. 10:33).

అనేకులు బైబిలు చదువకుండగానే వారి సొంత అభిప్రాయ ములను ఏర్పరచుకొందురు, సరిగదా వారి యభిప్రాయములకు అనుగుణంగా బైబిలును మల్చుటకు ప్రయత్నింతురు. ఒకడు రక్షింపబడా లంటే విశ్వసించాలని వారు ఒప్పకొంటారు. అయితే విశ్వాసము మాత్రమే చాలునని వారు దానికి కలుపుతారు. మరియు విధేయత చూపు విశ్వాసము అవసరమని చెప్ప బైబిలు బోధను వారు నిరాకరిస్తారు (రోమా 1:5; 16:26; గలతీ 5:6; యాకోబు 2:19-24; హెబ్రీ 5:9; లూకా 6:46). మనము రక్షింపబడాలంటే కొన్ని బైబిలు షరతులకు లోబడాలి. విశ్వాసము వలన మాత్రమేకాదు. మార్కు 16:16; అపొ.కా. 2:38; 11:18-22; రోమా 10:9, 10; 1 పేతురు 3:21 చదువండి. ఏఅంశమును గూర్చి యైనను బైబిలు చెప్పనందయు అంగీకరించాలి.

బైబిలులోని ప్రాధమిక సంగతులను తెలిసికొని, దేవుడు కోరు రీతిగ జీవించుటకు మొదలు పెట్టి దేవుడు బైబిలులో చెప్పిన సంగతులను గూర్చిన జ్ఞానమును మనం దినదినము అభివృద్ధి పరచుకోవాలి. తన గ్రంధములో దేవుడు అన్నిటినీ మనకు బయలు పరచలేదు. "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును" (ద్వితి 29:29), అయితే ఆయన బయలు పరిచిన సంగతులను చదివి ధ్యానించుట వలన ఆశీర్వదించ బడుదుము.

కొందరు నిరుపయోగమైన బైబిలు అంశములపై తన సమయాన్ని వెచ్చిస్తారు. అందరికంటె పొడవైన వాడెవడు? అందరికంటె బలవంతు డెవడు? ఎక్కువ కాలము బ్రతికిన వాడెవడు? మొదలగునవి.

మరికొందరు ఒకటి రెండు అంశములను తెలిసికొని అంతటితో ఆగిపోతారు. అయితే మనము "యేసుక్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞానమందును అభివృద్ధి పొందాలి" (1పేతురు 3:18).

మనలో యున్న దురభిమాన ద్వేషమును విడనాడి సత్యమును గ్రహింతము. దేవుని వాక్యమందలి జ్ఞానంలో మనము పెరుగుచుండగా యిదివరకు మనము ఏర్పరచుకొనిన భావములు తప్పు అని గ్రహించగానే, వాటిని విసర్జించాలి, సత్యాన్ని చేపట్టాలి. అప్పుడుదేవుడు సంతోషిస్తాడు!!

(సమాప్తము)

"మీరు నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు, అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని" యేసు చెప్పెను (యోహాను 8:31).

"యేసు-నేనే మార్గమును, సత్యమును, జీవమును, నాద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకురాడు" అని చెప్పెను ('యోహాను 14:6).

"సత్యమునందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము" (యోహాను 17:17).

గమనిక : సత్యవాక్కు వలయు వారు సంవత్సరమునకు 30/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

**Satya Vani, P.O.Box - 80, Kakinada - 533 001.**

కంటె బాగా నోట్స్ వ్రాసుకో గలుచున్నాము.

సదరు రిఫరెన్సులను ప్రయోగించి సంఘాలలో బోధించుట వలన నా బోటి వాళ్లకు కూడ ప్రశంసల జల్లు! ఇది నిజము. ఈ 'సత్యవాణి' కార్యక్రమములను ప్రభువు తన సేవకొరకు నిరంతరము వాడుకోవాలని, సత్యవాణి ప్రబోధకులయిన మీకును, మీ బృందములోని వారికిని దేవుడు ఆయురారోగ్యముల నిచ్చి నడిపించాలని ప్రార్థిస్తున్నాము.

యాంకరింగ్ చేస్తున్న రాబిన్ గూటం గార్కి, కబితా గూటం గార్కి చక్కగా పాడుచున్న బృందగాయకులను మా అభినందనలు తెలుపగలరు".

- **S.R.** తిరుసుళ్ల, చీపురుపల్లి.

అయ్యా, "మీరు టీ.వీ.లో చెప్పచున్న వాక్యములు ఆత్మీయముగా ఎదుగుటకు అవుసరమై యున్నవి. మీరు పంపే బైబిలు పాఠములు ఆత్మీయాభివృద్ధికి తోడ్పడుచున్నవి. గనుక ఆ పాఠములు పంపండి".

- మోర్త మణికుమార్, పిఠాపురం.

**Sir,** మీ పరిచర్యను గూర్చి మేము ప్రార్థించు చున్నాము. తేజ ఛానల్‌లో ప్రచురించుచున్న కార్యక్రమములకై వందనములు. అవి సత్యాన్ని తెలుసుకోవడానికి, అందులో యుండడానికి దోహద పడుతున్నాయి. మీ సత్యవాక్కు మాసపత్రిక వలన నేనెంతో ఆత్మీయంగా ఎదిగాను. ఎన్నో విషయాలు తెలుసుకో గలిగాను".

- **P.** రామకృష్ణ, ద్వారకా తిరుమల.

జాషువా గూటం గారికి

వందనములు, మీరు పంపిన బైబిల్ కోర్సు పుస్తక పాఠములు మరి మరీ చదివాను చాలా విషయాలు తెలుసుకొన్నాను. క్రైస్తవులకే తెలియని చాలా విషయాలు అందులో ఉన్నవని గ్రహించగలిగాను. సువార్త గురించి, రక్షణ గురించి బాప్తిస్మము గురించి చాలా విలువైన విషయాల్ని మీరు చక్కగా చదువరికి అర్ధమగునట్లుగా విపులీకరించినారు. బోధకుడు అవసరం లేకుండానే మీ పాఠములు బోధించు చున్నవి. ఆత్మీయంగా నాకు చాలా ఆనందం కలిగినది. క్రీస్తు సంఘం అంటే ఏమిటో నాకు బోధ పడింది. మీరు పంపిన పాఠాలను అమూల్యమైనవిగా భావించి భద్ర పరిచాను.

**K.** మోహన్ కుమార్, పెనుకొండ.

అయ్యా,

తేజ టి.వి. ఛానల్‌లో సత్య సువార్తను ఎంతో క్లుప్తముగా విశ్లేషించుచున్నారు. ప్రతి శనివారం ఉ॥ 6.30 నుండి 7.00 వరకు అరగంటలో మీరు మాకు అందించే పరమ సత్యాలు మా విశ్వాస జీవితమునకు ఎంతో ఊరట కలిగించుచున్నవి. మరి ముఖ్యముగా వ్రాయునది ఏమనగా టి.విలో దేవుని సువార్త ఎందరో చెప్పుచున్నారు గాని జాషువాగారు అరగంటలో ఒడపోసినట్లుగా క్రోడీకరించి దైవ గ్రంథములో వున్న మర్మములను తేటపరచుచున్నారు. ఇది అనేక మంది ఆత్మీయ అభివృద్ధి ఎంతగానో తోడ్పడుచున్నది. నేను స్వయంగా ఎంతో మంది డినామినేషన్ వారి ద్వారా విన్నాను. క్రొత్త నిబంధన సత్యమును జాషువా గూటం గారు ఎంతో చక్కగా చెప్పుతున్నారు. బైబిలులో వున్న మర్మములను చక్కగా వివరించుచున్నారు. ఆయన చెప్పేది సత్యము అని వారు ఒప్పుకొనుచున్నారు.

M. సౌలు, మొరకముడి డ్యామ్, విజయనగరం జిల్లా

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2002

From

SATYA VAKKU
P.O. Box 80
Kakinada - 533 001

To

Edited & Published by Joshua Gootam Printed by him at
Satya Vani Publications, Samabamurthy st. Kakinada - 533 004.